

# నన్ను క్షమించవూ?

శ్రీమతి
పరిమళా
సోమేశ్వర్

గోపాలం మెడిసిన్ మూడవ సంవత్సరం చదువుతున్న రోజులవి.

ఎనాటమీ థియరీకి మిసెస్ లలితా జగన్నాథ్ వచ్చేది. లలిత ఆ సంవత్సరమే యం. బి. బి. యస్ అదే కాలేజీలో ప్యాసై వెంటనే డిమాన్‌స్ట్రేటర్‌గా చేరింది. నిన్న మొన్నటివరకు తమ సీనియర్‌గా ఉంటూ వచ్చిన లలిత యిప్పుడు ఒక్కసారిగా ఆచార్య స్థానాన్ని ఆక్రమించటం గోపాలం క్లాసులోని వాళ్ళకెవరికీ అంతగా రుచించలేదు. అందువల్ల ఆవిడ నెవరూ గౌరవంగా చూసేవాళ్ళుకాదు.

పైగా లలితకూడా చూట్టానికి సన్నగా పొట్టిగా ఉండి వయసులో చాలా చిన్నగా కనపడేది. ఆమె ముఖంలో హుందాతనంకన్న ఎక్కువగా అమాయకత్వమే కనపడటం వల్ల తెలియనివాళ్ళు చాలామంది ఆమెను విద్యార్థినిగానే భావించేవారు.

పైగా ఆవిడ పట్టి యం బీ బియస్సే కనుక తను మూడవసంవత్సరంలో చదువుకున్న ఎనాటమీనే విద్యార్థులకు కూడా బోధిస్తుంది కాబట్టి ఆవిడవల్ల ఎక్కువగా నేర్చుకునే విషయాలేవీ లేవనీ, టెక్స్టుబుక్కు చదువుకుంటే తమకి కూడా ఆమాత్రం అర్థమవుతుందనీ ఆ క్లాసు విద్యార్థులందరి దృఢవిశ్వాసం. ఈ విషయాలన్నీ మనసులో పెట్టుకుని గోపాలం క్లాసులోని విద్యార్థులెవరూ ఆవిడ చెప్పే పాఠాన్ని శ్రద్ధగా వినేవాళ్ళుకాదు. పైగా విద్యార్థు లందరిలోనూ సహజంగా ఉండే కొంటెతనంవల్ల ఆవిడ పాఠం చెప్తుంటే మధ్యలో అడ్డుప్రశ్నలు వేసి విసిగిస్తుండేవారు.

లలితకికూడా బోధనావృత్తి క్రొత్త అవటంవల్ల ఆ కొంటె కోణంగుల ప్రశ్నలతో కంగారు పడిపోయి తను యింటి దగ్గర ఎంతో కష్టపడి తయారుచేసుకున్న పాఠాన్ని కాస్త మర్చిపోయేది. దాంతో ఆ అదను కనిపెట్టి విద్యార్థులింకా ఏడిపించేవారామెను. ఒక్కోసారి వాళ్ళుపెట్టే బాధలువడలేక లలితకు కళ్ళనీళ్ళ పర్యంత మవుతూండేది. ఆమె బలహీనతను గ్రహించిన విద్యార్థులు ఆమెను మరీ విసిగించటం ఆవిడ ఒకటి రెండుసార్లు విద్యార్థులముందే ఏడ్చేసెయ్యటం కూడా జరిగింది. ప్రిన్సిపాల్‌కి చెప్పినాకూడా ఫలితం అంత

ప్రోత్సాహకరంగా లేకపోయింది. ఎందుకంటే విద్యార్థులలో ఒక అభిప్రాయంగాని అలజడిగాని మూక ఉమ్మడిగా తలెత్తిందంటే యిక దానిని ఆపటం బ్రహ్మతరం కూడా కాదని పదిహేనేళ్ళుగా ప్రిన్సిపాలు స్థానంలో ఉంటూవచ్చిన అయనకు క్షుణ్ణంగా తెలుసు. అందుకే ఆవిడ మానాన ఆవిడను వదిలేసి తనకేం పట్టనట్టు ఊరుకున్నాడాయన.

ఇక లలితకు ఎలాగైనా తనే పిల్లలను కంట్రోల్ చేయలేకపోతే ఆ ఉద్యోగానికే రాజీనామా యివ్వవలసిన అగత్యం పట్టవచ్చునని అర్థమైపోయింది. అందువల్ల క్లాసులోకి ప్రవేశిస్తూనే పాఠం చెప్పటం మానివేసి, క్లాసంతా మూలమూలలా పరిశీలించటం, ఎవడైనా కాస్త గొంతెత్తినట్లు కనిపిస్తే అతనిని నిలబెట్టి ముఖం వాచేలా చివాట్లు పెట్టటం మొదలెట్టింది. మొదట్లో కొద్దిరోజులు యీ మందు పనిచేసినట్లు కనపడ్డా వెంటనే తిరగబెట్టిన జబ్బులా విద్యార్థులలోని 'ఇన్ డిసిప్లిన్'కూడా ద్విగుణీకృత బలంతో విజృంభించింది. ఆవిడ నోటినుండి ఒక్కొక్కతిట్టు బయటకు వస్తున్నకొలదీ ఆ మూలనుండి యీ మూలనుండి పిల్లికూతలు, నక్కకూతలు, ఈలలు, కేకలు కూడా జోరుగానే వినవస్తుండేవి.

ఐతే ఆ క్లాసులోని విద్యార్థులందరూ కూడా ఆమెకు తాటాకులు కట్టేవాళ్ళేననటానికి వీల్లేదు.' ఆమెమీద సానుభూతి అభిమానంకూడా ఉన్న విద్యార్థులు కొందరు లేకపోలేదు. అలాటి వారిలో గోపాలం ముఖ్యుడు. గోపాలం చాలా బుద్ధిమంతుడు. క్లాసులోని తోటి విద్యార్థులందరి కంటె వయసులో చిన్నవాడేకాక బాగా ఎదగనందున మరీ చిన్నవాడిలా కనిపించేవాడు. కష్టపడి చదివి ఎప్పుడూ రాంకులు తెచ్చుకునే విద్యార్థి గోపాలం. కొంటెతనం ఏ కోశానాలేని అమాయకుడతను. కాని లలిత క్లాసులో అతను ఏనాడూ అల్లరి చేయకపోయినా తోటి విద్యార్థులంతా ఆమెను ఆటలు పట్టిస్తుంటె లోలోపల ఆనందిస్తూండేవాడు.

ఐతే పైకి ఎన్నడూ అల్లరి చేసినట్లు అతను కనపడక ఫస్టుబెంచిలో మొదటిసీట్లో లెక్చరర్ కుర్చీకి దగ్గర్లో కూర్చుని పాఠాలను ఎంతో శ్రద్ధగా వినే గోపాలాన్ని లలిత ఎంతో అభిమానించేది. 'విద్యార్థులంతాకూడా గోపాలం లాగానే ఉంటే ఎంత బాగుండును!' అనుకునేది, క్లాసులోని విద్యార్థుల ఆకతాయి తనంతో ప్రాణం విసిగిన లలిత ఒక్కోప్పుడు.

ఆమె చెప్పే ప్రతివాక్యాన్నీ నోట్సులో వ్రాసుకునేవాడు గోపాలం. ఆమె ఏ సమయంలో ఎలాటిప్రశ్న వేసినా ఠకీమని జవాబిచ్చేవాడు. ఆమె క్లాసుకు రాగానే క్రితం క్లాసులో ఏ పాఠం ఎంతవరకు చెప్పిందీ అతనే చెప్పేవాడు. అదిచూసి మిగతావాళ్ళంతా ఏడిపించేవారు గోపాలాన్ని. 'ఎందుకురా 'మేడమ్' నలాకాకా పడ్తావు యిప్పట్నుండి? నువ్వెంత ఆవిడమెప్పు పొందినా నీకేం లాభంలేదుగురూ! ఆవిడేం నీకు మార్కులివ్వదు కదా?' అనేవారు.

'మార్కులకోసమే ప్రొఫెసర్లను 'కాకా' పట్టాలన్న దుర్బుద్ధి నాకేం లేదు. ఆవిడ మనకు గురువు. ఆవిడను గౌరవించటం మన కర్తవ్యం' అనేవాడు గోపాలం. అది విని ఫక్కున నవ్వేవారు మిగతా విద్యార్థులు.

'పోరా చచ్చు దద్దమ్మ! నీలో అసలు సెన్సాఫ్ హ్యూమర్ లేదోయ్! ఎంతసేపూ పుస్తకాలను తినెయ్యటంతప్ప. బంగారు స్వప్నంవంటి విద్యార్థిజీవితాన్ని 'ఎంజాయ్' చెయ్యటమే రాదు నీకు. 'పెద్దఆవిడ చెప్పే బోడిపాఠాలు మనం చదువుకోలేమా? ఆ ఏభై నిమిషాలు సర్దాగా గొడవ చేసి ఆనందించక ఎందుకోయ్ అంత శ్రద్ధగా వినటం?' అనేవారు. వారితో వాదించటం యిష్టంలేక విషయాన్ని మార్చేస్తుండేవాడు గోపాలం.

గోపాలం లలితను గౌరవించటానికి యింకొక కారణంకూడా ఉంది. అతనికిద్దరక్కయ్యలున్నారు. వాళ్ళిద్దరూ కూడా కాలేజీలో లెక్చెరర్లుగా పని చేస్తున్నారు. ఆమెను చూస్తున్నప్పుడల్లా తన అక్కయ్యలను ఆ స్థానంలో ఊహించుకునేవాడు గోపాలం. దాంతో ఆవిడను వేళాకోళం చెయ్యటానికి మనసొప్పేది కాదు. పైగా ఆవిడ అవస్థచూసి జాలిపడేవాడు.

అలా ఉండగా ఉన్నట్టుండి ఓరోజున ఆక్లాస్ విద్యార్థులందరికీ ఒక విషయం తెలిసింది—లలిత తల్లి కాబోతున్నట్టు. ఇక అదికూడా వారి వేళాకోళానికి పాత్రమైన విషయాలలోనే మారింది.

లలిత క్లాస్‌లోకి అడుగు పెట్టగానే 'క్యార్ క్యార్!' మంటూ చిన్నపిల్లాడిలా ఏడ్చేడు ఒక విద్యార్థి.

మరో విద్యార్థి 'ళ్లోళ్లోళ్లో హాయీ' అంటూ జోలపాడేడు. బోర్డుమీద ఒక పసిపాప బొమ్మ, రెడ్ ట్రయాంగిల్ గీసి ఉన్నాయ్.

ఇవన్నీ చూసి సిగ్గుతో చితికిపోయింది లలిత. వెంటనే రుద్రకాళిలా మారి 'ఛీ! మీరు మనుషులేనా? స్త్రీలోని మాతృత్వాన్ని అపహాస్యం చేసే మీరు భారతీయులేనా? మీలో నానాటికీ సున్నితమైన భావాలు నశించిపోతున్నాయ్. కనీసపు మానవత్వపు విలువలనుకూడా కోల్పోతున్న మీరు మనుష్యులుగా పిలవబడటానికి అర్హులుకారు. మీరు పశువులు జంతువులు...' అంటూ పిచ్చిగా అరచింది.

కొన్ని నిమిషాలపాటు నిశ్శబ్దంగా ఉండిపోయింది క్లాసంతా. ఆవిడ అన్నవిషయం ఆలోచించ దగ్గదిగా కనిపించినప్పటికీ ఆవిడ తమను 'జంతువులు—పశువులు' అనటం యేమాత్రం సమంజసంగా లేదనిపించింది కొందరికి. గోపాలంలాటి ఒకరిద్దరు విద్యార్థులు మాత్రం 'మేడమ్ యీరోజు మంచిడోసే యిచ్చింది వీళ్ళకు' అనుకున్నారు.

ఐనా ఆ క్లాసులో చాలామంది విద్యార్థులకు ఆవిడ వాడినపదాలు చాలా అవమానకరంగా కనిపించినయ్.

ఒకతను లేచినలబడి 'మేడమ్! మీరనవసరంగా నోరు జారుతున్నారు...' అన్నాడు.

దాంతో మరింత రెచ్చిపోయింది లలిత. 'నేను అన్న వాక్యాల్లో ఒక్కటికూడా అనవసరమైనది లేదు. మిమ్మల్ని దూషించటానికి నేను వాడినపదాలు నిజానికి చాలా తేలికైనవి. ఇంతకంటె ఘాటైన పదాలనుకూడా మీకు వాడవలసి ఉంటుంది' అన్నది ఉద్రేకంగా. ఆక్రురవాడు మళ్లీ యేదో అనబోతుంటే పక్కనేఉన్న గోపాలం అతని చెయ్యిపట్టుకుని బలవంతాన కూర్చోపెట్టేడు. 'చూడు రమేశ్! మేడమ్ అసలే ప్రెగ్నెంట్...ఈ సమయంలో బ్లడ్ ప్రెషర్ ఎక్కువగా ఉండటం మాటిమాటికీ ఉద్రేకపడటం సహజం. అలాటప్పుడు అనవసరంగా ఆవిడను చికాకు పర్చటం




తెల్లమచ్చలు

"స్వేత మోచన్" ఆయుర్వేద ఔషధాన్ని వాడిన, మచలరంగు మూడు దినములలో మారగలదు వేలకొలది ప్రజలు దీనిని గొప్పగా కొనియాడి యున్నారు. ప్రచారం కొరకు ఒక పీసా మందు ఉచితంగా పంపుతాము. వెంటనే వ్రాయండి.

Indra Ayurved Bhavan (13)
P. O. Katri Sarai (Gaya)

మూలశంకకు
త్వరగా
నమ్మకమైన
హెడన్‌సాతో
చికిత్సను పొందండి
-శస్త్రచికిత్స
అవసరములేదు!

DOL 327 TEL


# నన్ను క్షమించరూ ?

అమానుషం కాదూ? ఇలా ఆవిడ ఊరికే ప్రతి చిన్న విషయానికీ ఉద్రేకపడుతుంటే ఆవిడ ఆరోగ్యానికే దెబ్బ. మనకి గురుస్థానంలో ఉన్నవ్యక్తి ఒకటికి రెండు మాట లంటేమాత్రం ఎందుకు మనం కోపం తెచ్చుకోవాలి? మన తల్లిదండ్రులు కోప్పడితే మనం ఎదురుతిరుగుతామా?' అంటూ నచ్చ చెప్పేడు.

దాంతో రమేశ్ కొంచెం మెత్తపడ్డాడు. 'అది నిజమేననుకో! ఎంతైనా మనం మెడిసిన్ మూడో సంవత్సరంలో ఉన్నాం కదా. మరీ అంత దారుణంగా తిడ్తే మన 'డిగ్నిటీ'కి భంగం కదూ?' అన్నాడు షర్టు కాలరు సవరించుకుంటూ.

గోపాలం రమేశ్‌కి నచ్చచెప్పి కూర్చోపెట్టటం లలిత చూసింది. దాంతో ఆమెకి గోపాలంయెడల మరింత మంచి అభిప్రాయం యేర్పడిపోయింది.

కోపం చల్లారేక పాఠం మొదలెట్టింది లలిత.

రోజులు దొర్లిపోతున్నాయ్. నానాటికీ లలిత క్లాసులో విద్యార్థులు చేసే అల్లరి, లలితలోని అసహనమూడా తీవ్రతరమవుతున్నయ్. నిండు గర్భవతియైన లలిత క్లాసులో కొంచెం కలవరంకాని, ఏమాత్రం శబ్దంగాని వినపడితే చాలు, ఎంతో ఆవేశంతో ఊగిపోతూ రక్తనాళాలు ప్రబద్ద లయ్యేంత గట్టిగా అరుస్తూ వాళ్ళను తిట్టేది. ఐతే ఆ క్లాసు విద్యార్థులు ఆవిడ తిట్లను లెక్కచెయ్యటం మానివేసేరు. ప్రత్యేకం ఆవిడచేత తిట్లు తినే ఉద్దేశ్యంతో అల్లరిచేసే మనస్తత్వాన్ని పెంచుకున్న విద్యార్థులుకూడా కొందరున్నారు. ఆవిడకోపం వారందరికీ నవ్వులాటగా తయారయింది.

ఓరోజు మామూలుగా క్లాసు జరుగుతోంది. ఎప్పటిలానే లలిత తన దారిన తాను పాఠం చెప్పుకుపోతుంటే పిల్లలంతా ఎవరి గొడవలో వారున్నారు. కొందరు రికార్డులు వ్రాసుకుంటుంటే కొందరు డిటెక్టివ్ నవలలు చదువుకుంటున్నారు. కొందరు 'చుక్కలాట' ఆడుతుంటే మరి కొందరు క్రితం రాత్రి చూసిన ఇంగ్లీష్ పిక్చర్‌లోని హీరోయిన్‌నిగూర్చి మాట్లాడుతున్నారు.

ఐతే ఆవిడ పాఠాన్ని శ్రద్ధగా వింటున్న విద్యార్థి ఆ తొంభైఆరుమందిలోను ఒక్కడుకూడా లేడు.

మొదటి బెంచిలో కూర్చున్న గోపాలం కూడా 'మేడమ్' ముఖంవంక చూస్తూ కూర్చున్నాడే తప్ప అతనికి పాఠంమాత్రం ఏమీ బుర్రకెక్కటం లేదు. పిల్లలు చేసే రణగొణధ్వనిలో యీ మధ్య పాఠం వినటానికికూడా యిష్టం ఉండటం లేదతనికి. ఊరికే క్లాసులో నిశ్శబ్దంగా కూర్చునేవాడు తప్ప పాఠంమీద ధ్యాసే ఉండటం లేదు. 'ఇంటికివెళ్ళి చదువుకుంటే అర్థంకాదా?' అని అనుకునేంతవరకు వచ్చేడు గోపాలం కూడా. ఎంతైనా మరో రెండు నెలల్లో నాల్గవ సంవత్సరంలోకి ప్రవేశించబోతున్న మెడిసిన్ విద్యార్థియ్యె! ఆమాత్రం ధీమా ఉండటంలో అసహజత్వం యేమీలేదు

తదేకంగా మేడమ్ వంకనే చూస్తూ కూర్చున్న గోపాలం బుర్రలో తళుక్కుమని ఒక ఆలోచన మెరిసింది. వెంటనే నోట్ బుక్కులోనుండి ఒక కాగితం చింపి దాని మీద వ్రాయటం మొదలెట్టేడు.

'ఎనాటమీ మేడమ్,
ఎంతో చక్కని మేడమ్!
అందమైన కళ్ళతో,
ఆరని చిరునవ్వుతో,
అలరారే మేడమ్!
ఐతే ఉన్నదొక్కలోపం;
అదే ముక్కుమీద కోపం!'

అని గేయంలాంటి దొకటి చకచకా వ్రాసి పారేసేడు గోపాలం. ఈ మధ్య కవిని కావాలన్న కాంక్ష తీవ్రంగా చెలరేగుతోంది గోపాలంలో. అంత ఆశువుగా వ్రాసేసిన ఆ గేయాన్ని చూసి ఎంతో మురిసిపోయేడు గోపాలం. అంతటితో అతని సంతోషం ఆగలేదు. పక్కనే కూర్చున్న విద్యార్థికి సగర్వంగా చూపించేడు తన పాండితీ ప్రకర్షను. అది చదివి బ్రహ్మానందభరితుడైన ఆ విద్యార్థి తన పక్కవాడికి చూపేడు. అలా బయల్దేరిన ఆ కాగితం ఐదారు నిమిషాల్లో క్లాస్ రూమంతా తిరిగొచ్చింది. దాంతో పెద్ద కలకలం బయల్దేరింది విద్యార్థులలో. నవ్వులు, ఈలలు 'శభాష్, వహ్వా!' లాటి కేకలు వినపడ సాగినయ్,

[illegible] ఆ విద్యార్థుల కేకలు గోపాలం కవిత్వాన్ని మెచ్చుకుంటూ వేసినవి కావు, మేడమ్‌ని అల్లరి పట్టించటానికి ఒక వినూత్నమైన అద్భుతమైన అవకాశం లభించినందుకు—ఆ విషయాన్ని గ్రహించిన గోపాలం బిక్క చచ్చిపోయేడు.

లలిత పాఠం ఆపి విద్యార్థులవంక తేరి పారజూసింది. వారి కలవరానికి కారణమేమిటో శోధించగా దానికి కారణ భూతమైన కాగితంముక్క ఆమెచేతికి చిక్కింది. అందులో ఉన్నది చదువుతూనే ఆమె ముఖం కందగడ్డలా అయిపోయింది.

ఆ కాగితాన్ని ముక్కముక్కలుగా చింపి వేస్తూ 'ఈ చెత్త వ్రాసిన దౌర్భాగ్యుడెవడు?' అంది.

ఎవ్వరూ మాట్లాడలేదు?

'మిమ్మల్నే! మాట్లాడరేం? తను చేసిన పనిని ఒప్పుకొనే ధైర్యం లేని ఆచవట చచ్చుపీనుగ ఎవరు?' గద్దించింది లలిత.

గోపాలం భయపడుతూ లేచి నిల్చున్నాడు.

అతనిని చూస్తూ అంది లలిత 'నువ్వు చెప్పు గోపాలం. ఆ వ్రాసిన దౌర్భాగ్యుడి పేరేమిటో చెప్పు. తనకి చదువు చెప్పే వ్యక్తిని, తన భావి జీవిత సౌధానికి సోపానాలు నిర్మించే వ్యక్తిని, మాతృ సమానురాలైన స్త్రీని గురించి అంత చులకనగా వ్రాయగలిగిన ఆ కీచర్ ఎవరో చెప్పు...' అంది.

గోపాలం కంఠం పెగలి రాలేదు—గుడ్లప్పగించి మేడమ్‌వంక చూస్తూ నిలబడ్డాడు.

# నన్ను క్షమించరూ?

'చెప్పు గోపాలం నీ మీద నాకు మంచి నమ్మకం ఉంది. అబద్ధం చెప్పటం ఎంత పాపమో, నిజాన్ని దాచటంకూడా అంతే పాపం.' అన్నది లలిత.

ఆమాట వింటూనే కళ్లనీళ్ల పర్యంతమయింది గోపాలానికి. 'మే...డ...మ్! అది...వ్రా సిం ది ... నేనే!' అన్నాడు మెల్లగా.

నెత్తిన పిడుగుపడ్డట్టు నిశ్చేష్టురాలై నిల్చుంది లలిత కొంతసేపు. తరువాత తేరుకుని 'ఏమిటి గోపాలం! అది వ్రాసింది నువ్వా? నువ్వు...యిలాటి వాడివని కలలో కూడా ఊహించలేకపోయాను. నువ్వెంతో మంచివాడవనుకున్నాను. అందరిలానే అతి సామాన్యమైన విద్యార్థివనుకోలేదు...' ఎంతో బాధపడుతున్నట్లుగా అంది లలిత. ఆమె ఆ సమయంలో ఆ గేయంకోసంకన్నా ఎక్కువగా దానిని వ్రాసింది గోపాలం అన్న విషయాన్ని గురించే బాధపడుతున్నట్లు కనిపించింది.

అది గ్రహించిన గోపాలం సిగ్గుతో బాధతో మరింత కుంచించుకుపోయేడు. తనకి ఎంతో గౌరవపాత్రురాలై, తనని అభిమానించే మేడమ్ విశ్వాసాన్ని యీ ఒక్కరోజుతో పటాపంచలు చేసినందుకు తనని తాను నిందించుకున్నాడు.

ఇంతలో ఆ పిరియడేకాక, కాలేజీయే ముగిసినట్లుగా బెల్లయింది. లలిత గొణుక్కుంటూ—బయటికు వెళ్లిపోయింది.


గోపాలం తల వంచుకుని భారంగా అడుగులు వేసుకుంటూ యింటివైపుకు నడచేడు.

గోపాలం మనసంతా పూర్తిగా వికలమైపోయింది. నిజానికి తను చేసింది యేమంత ఘోరమైన విషయం కాకపోవచ్చు. కాని అది మేడమ్‌ని తీవ్రంగా గాయపరచింది. అసలే స్త్రీల మనస్తత్వం చాలా సున్నితంగా ఉంటుంది. ముఖ్యంగా బయటి సంఘంలోకి వచ్చినపుడు ప్రతి స్త్రీ అందరిచేత, ముఖ్యంగా పురుషులచేత గౌరవింపబడాలని కోరుకుంటుంది. అందునా ఉపాధ్యాయవృత్తిలో ఉన్న స్త్రీలు తమ విద్యార్థుల గౌరవాభిమానాలను పొందాలని కోరటంలో ఆశ్చర్యమేమీ లేదు.

ఐతే ఖర్మ కొద్దీగాని మరెందువల్లనన్నాకాని లలితమేడమ్ ఆ వృత్తిలోకి ప్రవేశించిన నాటినుండి విద్యార్థుల మనసును చూరగొనలేక పోయింది. దానికి బాధ్యత ఎక్కువ విద్యార్థులదే! నిజానికి లలిత మేడమ్ పాఠాన్ని ఎంతో చక్కగా, విపులంగా చెప్తుంది. ఆవిడ పాఠం వినాలన్న ఆసక్తి ఉంటే చాలు—సగటు విద్యార్థికి ఆవిడ చెప్పేది యెంతో చక్కగా అర్థమవుతుంది. అలా జరిగినట్లయితే విద్యార్థులందరూ ఆమెనెంతో అభిమానిస్తారు. కాని ఆ క్లాసులోని విద్యార్థులొక్కనాడన్నా ఆవిడ చెప్పే పాఠాన్ని విని అర్థం చేసుకోవటానికి ప్రయత్నించలేదు. మొదట్నుండీ ఆవిడమీద తేలిక భావాన్ని ఏర్పరచుకుని ఆమెను కించపరచటానికే ప్రయత్నించేరు తప్ప, కనీసం విద్యార్థులుగా తమ కర్తవ్యాన్ని నెరవేర్చుదామన్న ఉద్దేశ్యంకూడా లేకపోయింది వాళ్లకు.

ఈ విషయాలన్నీ తనకి తెలుసు. అందుకే ఆమెమీద తనకి సానుభూతి ఉండేది. అదీ కాక గురువుగా ఆవిడను గౌరవించేవాడు కూడాను.

ఈ రోజిలా తను ఆమె రూపాన్ని గురించి వర్ణిస్తూ వ్రాయటంలో నిజంగా తను చాలా తప్పుపనే చేసేడు. ముఖ్యంగా ఆ స్థానంలో ఉన్న వ్యక్తిని, మాతృమూర్తి కాబోతున్న ఒక స్త్రీనిగూర్చి వేళాకోళంగా మాట్లాడటం సభ్యతగల మనిషికి తగదు. తనూ ఒక స్త్రీకి కొడుకు. అలాటి మరో స్త్రీకి తండ్రికూడా అవుతాడు భవిష్య



...లో. ఒక స్త్రీని యిలాగేనా తను గౌర వించటం? తన అక్కయ్యలుకూడా ఆడవాళ్లే! వాళ్లను విద్యార్థులిలా అవమాన పరిస్తే తను సహించగలడా? ఆమెనవ మాన పరచిన విద్యార్థి రక్తం కళ్ల జూడడూ?

అలా ఆలోచించుకుంటూ యింటికి వెళ్లాడు గోపాలం. ఆ రోజు భోజనం సయించలేదు గోపాలానికి. నిద్రా పట్టలేదు. ఎన్నడూ చెయ్యక చెయ్యక ఒక చిన్న తప్పు చేసి, దానిని మహాపరాధంగా భావించేసరికి అతనికి మనసు చెదిరిపోయినట్లయింది. ఇక ఆపుకోలేక కళ్ల నీళ్లు పెట్టుకుని పెద్దక్కయ్యతో చెప్పేడు జరిగిన సంగతంతా. అతను చెప్పిందంతావిని ఆమె తమ్ముడివీపు ప్రేమగా నిమిరింది. 'చూడు గోపాలం. ఇలాటివన్నీ చాలా సున్నితమైన విషయాలు. కొందరు వీటిని ఎంత తేలిగ్గా తీసి పారవేస్తారో మరికొందరు వాటికి అంతటి అధిక ప్రాముఖ్యతనిచ్చి ఆలో చిస్తారు. నువ్వు యీ రెండవ రకానికి చెందిన మనిషివి. పైగా ఆవిడ నిండు గర్భిణీ అనికూడా చెప్తున్నావు. అలాటి స్థితిలో ఆమెను బాధపెట్టటం, ఆమెను తెచ్చగొట్టటం ఎంత క్రూరత్వమో ఆలో చించు ... సరే కనీసం చేసినదానికి పశ్చా త్తాప పడేపాటి సెన్సిటివ్‌నెస్ అయినా ఉంది. అదే చాలు. ఇప్పటికైనా మించి పోయిందేమీ లేదు. రేపు మేడమ్ దగ్గరకు వెళ్లి క్షమాపణ చెప్పుకో. ఇంక యిలాటి బుద్ధితక్కువ పను లెన్నడూ చెయ్యనవి గట్టిగా చెప్పు ఆవిడతో. ఆవిడ తప్ప కుండా నిన్ను క్షమించి, తిరిగి అభిమాని స్తుందనే నా నమ్మకం.

చూడు గోపాలం. ఈ రోజుల్లో విద్యా ర్థులలో ఒక విచిత్రమైన మనస్తత్వం యేర్పడిపోయింది. చాలామంది విద్యార్థులు తాము సర్వజ్ఞులమనీ, ఉపాధ్యాయుడు చెప్పే పాఠం తాముకూడా చదివి అర్థం చేసుకో గలమని భావిస్తారు. అంతేకాదు. కనీసం తమ ఉపాధ్యాయుల వయస్సుని, వారి స్థానాన్నికూడా గౌరవించటం మానివేస్తు న్నారు. ఇది చాలా విధ్వంసకరమైనపద్ధతి. విద్యవల్ల వినయం రావటం నిజమే కాని వినయంలేని వ్యక్తి విద్య నార్జించలేడన్న విషయంకూడా అంత నిజమే! విద్యార్థికి


# ఋతుక్రమం ఆలస్యమైతే?

విచారపడవద్దు ప్రఖ్యాతిగాంచిన "దేవిపిల్సు" వాడండి

పూర్తికోర్సుప్యాకెట్టు 28 మాత్రలు వెల రు. 11/-
సగంకోర్సు ప్యాకెట్టు 14 మాత్రలు వెల రు. ...
వి పి పి అదనము
ప్రతిచోటుదొరకును




"దేవిపిల్సు" ముఖ్యంగా ఆలస్యమైన, క్రమముగాకాక పోయిన, బాధతోకూడిన, లేక ఆగిపోయినబహిష్టకు దేవిపిల్సు బాగుగ గుణమిచ్చును

1 అన్ని సందర్భములలోను శీఘ్రముగాను, అమోఘము గాను పనిచేయును
2 ఏస్థితిలోను ఆరోగ్యమునకు ఎట్టిహాని కలిగించవు

MFRS SEENU & CO., MADRAS-21

ప్రఖ్యాతి కెమిస్టులు మరియు డ్రగ్గిస్టు లందరివద్ద లభించును.

Advt. Permitted under G.O. MS. No. 1121

# సుఖం కావాలంటే?

మీ తీరిక కాలంలో సుఖ సంతోషాలకు "తెలుసుకోదగ్గవి" అనే పుస్తకం చదవండి. అందులో మిమ్మల్ని మైమరపించే ప్రేమగాథలు, నవ్వించే వింతలు, హాస్యాలు, మహాత్ముల జీవిత చరిత్రలు, పెద్దల జీవిత అనుభవాలు, ఆశ్చర్యాన్ని కాలక్షేపాన్ని యిచ్చే అద్భుతాలు, నవీన ఆరోగ్య సాధనలు, విచిత్ర ప్రేమగాథలు, జీవిత విజయమార్గాలు, వివాహ సమస్యలు, తెలివి సమాధానాలు, అద్భుత మానసిక శక్తులు, దివ్య సందేశాలు, ప్రపంచ ఘోరాలు, విషాదాలు, నవీన ఆత్మ పరిశోధనలు, మిత్రులను నవ్వించటానికి పనికొచ్చేవి, మానసిక బాధలు పోగొట్టుకొనే మార్గాలు, ఇంకా మీ కెన్నో విధాల ఆనందానిచ్చే అనేక వందల విషయాలందున్నాయి. వెల రూ. 5/- పోస్టు ఖర్చు ఉచితం. మీ సుఖానికి తప్పక చదవండి. దేశసేవ ప్రచురణలు, ఏలూరు, ఆంధ్రకు వ్రాస్తే మీకొక పుస్తకం వి పి పోస్టుద్వారా పంపబడును. SWASTIK

ఓం! తత్! సత్!



# సుఖ జీవిత సేవ

"సిద్ధవైద్యమహిమ"

సిద్ధుల సాటిలేని కీర్తికి ఒక తార్కాణము

కే. టి. కృష్ణమూర్తి ఆచ్చారి గారి

## 'మేల్ మాయిల్ మందు'

(Regd)

దీర్ఘకాల చర్మరోగములకు చక్కని నివారిణి

నల్లరంగు, ఎర్రరంగు పొడలు, దద్దులు, పోట్లు, గజ్జి (చర్మసంబంధము) పొడలు గల చోట్లలో తిమురులు, సూదితో పొడిచినప్పుడు నొప్పి లేకుండుట, నిప్పవడి బొబ్బలు గలిగినా తెలియకుండుట, దుర్‌నీరు సర్వ అవయవములందు వ్యాపించి, రక్తములో కలిసి మత్తు కలుగజేయుట, (నరముల సంబంధము) చేతివ్రేళ్లు ముడుచుకొనుట, బొబ్బలు లేచుట, ముక్కు బంధనములు, పాదము నందు పల్లపు పుండ్లు ఏర్పడుట, కాలుచేతులు వ్రేళ్ళు తగ్గుట, ముక్కు సొట్టపడుట, చూచుటకు వినుగు పుట్టించు రణములు (అస్థి సంబంధము) వీటికి చక్కని నివారిణి.

1 మండలం (40 రోజులు) నూనె, లేహ్యము రు. 11/- తపాల ఖర్చు రు. 2.50

8 ఔన్సుల శ్రీ పరమాత్మ తైలం రు.5/- తపాల ఖర్చు రు. 2/-

సిద్ధడాక్టర్

# కే. టి. కృష్ణమూర్తి ఆచ్చారి & సన్సు

5/22, మేల్ మాయిల్ P.O., (N.A Dt.)

# నన్ను క్షమించరూ ?

హోదాంగా ఉండవలసిన వినయ విధేయతలు, జ్ఞాన పిపాస, మొదలైన సద్గుణాలన్నీ నానాటికీ చచ్చిపోతున్నాయ్. దీనికి రాజకీయ, సాంఘిక, నైతికమైన కారణాలు ఎన్నో ఉన్నాయ్...ఐతే నువ్వుకూడా యీ రకమైన మనస్తత్వాన్ని అలవర్చుకుంటావని నేనెన్నడూ అనుకోలేదు ...' అంటూ చిన్న ఉపన్యాసం యిచ్చింది.

గోపాలానికి ఆరాత్రి నిద్ర పట్టలేదు సరిగ్గా. ఎప్పుడు తెల్లవారుతుందా ఎప్పుడు కాలేజీకి వెళ్లి మేడమ్‌ని క్షమాపణ వేడుకుందామా అని తహ తహ లాడిపోతున్నాడతను. రాత్రంతా కలత నిదురే. ఆ నిద్రలో నిండునెలలతో భారంగా కదులుతున్న లలిత. తను ఆమెను గురించి వ్రాసేడన్న విషయం విని బాధతో, ఆశ్చర్యంతో విశ్వేష్టురాలైనప్పటి ఆమె ఆకృతి...అతని కళ్లముందు కదలాడ సాగినాయ్. 'మేడమ్ ! ఇంకెప్పుడూ మిమ్మల్నిలా బాధపెట్టను నన్ను క్షమించండి. నన్ను... నన్ను క్షమించరూ ?' అంటూ కలవరించేడు గోపాలం. మధ్యలో మెలకువ వచ్చినపుడల్లా పీడ కలనుండి మేల్కొన్న వాడిలా భయంతో వణికిపోయేవాడు. జీవితంలో అంతటి మానసిక వేదనకు గురి అవటం అతనికిదే మొదటిసారి ! ఆ రాత్రి ఎంతో సుదీర్ఘంగా, విషాదంగా, బరువుగా, భయంకరంగా గడిచింది.

ఎలాగో తెల్లవారింది.

త్వర త్వరగా పనులన్నీ ముగించుకుని కాలేజీకి రోజూకన్నా పావుగంట ముందే చేరుకున్నాడు గోపాలం. కాలేజీగనుక ప్రారంభమైనదంటే లలిత మేడమ్ మొదటి పిరియడ్ క్లాస్‌కి వెళ్లిపోవచ్చు. కనుక ముందుగానే ఆమె కాలేజీలోకి అడుగు పెడుతుండగానే ఆమెకు ఎదురై క్షమాపణ చెప్పుకోవాలనుకున్నాడు గోపాలం.

అతను కాలేజీలోకి ప్రవేశించగానే వాతావరణంలో ఏదో మార్పు ఉన్నట్లు ఒక్కక్షణంలోనే గ్రహించ గలిగేడు. విద్యార్థులంతా గుంపులు గుంపులుగా నిలబడి మాట్లాడు కుంటున్నారు. ప్రతి ఒక్కరి ముఖంలోను ఏదో ఆత్రం, కలవరం ఎవరూ క్లాసులకు వెళ్లే 'మూడ్'లో మాత్రం లేరని స్పష్టంగా తెలిసిపోతోంది.

'కొంపదీసి మళ్లా స్ట్రైక్ చెయ్యటం లేదుకదా వీళ్లు ?' అనుకున్నాడు గోపాలం.

గట్టిగా పైకి అంటే తోటి విద్యార్థులు తంతారని భయం కానీ — నిజంగా గోపాలానికి విద్యార్థులు 'స్ట్రైకు'ల పేరిట చేసే ఆర్భాటం అదీ అంటే యేమాత్రం గిట్టదు. నూటికో, కోటికో తప్ప సమ్మెకు మూలకారణాలనబడేవి వారి విద్యావ్యాసంగానికి, వారి పరిధులకు గాని సంబంధించి ఎప్పుడూ ఉండవు. లేనిపోని వ్యాపకాలను కల్పించుకుని తాత్కాలికంగా తమ విద్యుక్త ధర్మ నిర్వహణలోని బరువు బాధ్యతలనుండి తప్పించుకుంటానికి గాను యేర్పరచుకున్న 'రెడీ మేడ్ సాధనాలు' యీ సమ్మెలని గోపాలం అభిప్రాయం.

ఐనా కుతూహలం కొద్దీ యీ సారి యేం కారణం చెప్తారోనని తన క్లాస్‌మేట్ రవీంద్ర దగ్గరకు వెళ్లి అడిగేడు గోపాలం.

రవీంద్ర బిక్కమొహం వేసి 'మన ఎనాటమీ మేడమ్ రాత్రి చనిపోయింది గోపాలం!' అన్నాడు.

'ఏమిటి ? లలిత మేడమ్‌ని గురించేనా నువ్వు మాట్లాడుతున్నది? ఆవిడ చచ్చిపోయిందా ? అదెలా సంభవం', ఊపిరి బిగపట్టుకుని హీనస్వరంతో అడిగేడు గోపాలం.

'రాత్రి మేడమ్‌కి 'పెయిన్సు' వచ్చినయ్‌ట మన హాస్పిటల్లోనే చేర్పించేరు. సిజేరియన్ కేస్ అనుకుని చేసేరట ఐనా ఏ కారణంవల్లనో ఆవిడను బ్రతికించలేకపోయేరు హాస్పిటల్ సూపర్నెంట్‌కూడా వచ్చిందట, ఆ కేసును చూడటానికి. కాని ఆవిడకు ఆయువును పొయ్యలేకపోయారెవరూ!' రవీంద్ర కళ్లవెంబడి జలజల కన్నీరు రాలింది

లలితను రోజూ క్లాసులో ఆటలు పట్టించేవాళ్లలో రవీంద్ర ప్రముఖుడు. కాని యేదో బాల్య చాపల్యంకొద్దీ, విద్యార్థిలో సహజంగా ఉండే కొంటెతనంవల్లను ఆవిడ వేడిపించేవాడుకాని నిజానికి ఆవిడను అవమాన పర్చాలని, బాధపెట్టాలనీ మిగతా విద్యార్థులలాగానే అతనికూడా లేదు. అందుకే లలితయొక్క హఠాన్మరణం రవీంద్రను దుఃఖంలో ముంచివేసింది. నిన్న సాయంత్రం తమక్లాసులో అంత గొడవ జరిపించిన మేడమ్ యీ రోజు యీ లోకంలో లేదన్న సత్యం అతని గుండెను బాకులా పొడుస్తోంది. మృత్యువు యింత క్రూరంగా, నిర్దాక్షిణ్యంగా ఉంటుందని అతను గ్రహించటం అదే మొదటిసారి !

ఇక గోపాలమయితే లలిత మరణవార్త వింటూనే స్పృహతప్పి పడిపోయేడు. సంవత్సరం మొదట్నుండీ ఆమె అభిమానానికి పాత్రుడౌతూ వచ్చి, అనాలోచితంగా చేసిన చిన్న తప్పువల్ల ఆమె మనసుని తీవ్రంగా గాయపరచి, తనతప్పును గుర్తించి ఆవిడను క్షమాపణ వేడుకుని తనయెడల ఆమెకుగల దురభిప్రాయాన్ని పోగొడ్దామన్న గోపాలంలోని సున్నిత హృదయం ఆ దారుణమైన వార్తను భరించలేకపోయింది

స్పృహతప్పి పడిపోయిన గోపాలాన్ని కొందరు విద్యార్థులు మోసుకువెళ్లి వెంటనే హాస్పిటల్‌లో చేర్పించేరు. స్పృహ వచ్చినప్పుడల్లా 'మేడమ్' నన్ను క్షమించరూ ? ఇంకెప్పుడూ మిమ్మల్ని బాధపెట్టను మేడమ్! ఒక్కసారి నన్ను క్షమించానానండి. మేడమ్ ! నన్ను క్షమించరూ ?' అంటూ పిచ్చిగా అరవసాగాడు గోపాలం. ●



రాజస్థాన్ బాల. (ఫొటో: బి. పి. కృపలానీ)